అతను తండ్రి శరీరాన్ని తాకడం అదే మొదలు అందుకే జ్వరం ఈ ఒక్క రోజే వచ్చిందని అనుకున్నాడు.

కొడుకు తనపై ఇంత సడన్‌గా ప్రేమ చూపించడం ఆ పితృదేవుడికి ఆనందంతోపాటు ఆశ్చర్యం కలిగించింది. ఏదో అనాలని అనుకున్నాడు కానీ అందుకు కూడా ఓపికలేక నీరసంగా పడుకుని పోయేడు ఇల్వాలుడు.

"ప్రత్యూషా... నాన్నగారికి జ్వరంగా వుంది. పాలు తాగుతారు. వున్నాయా!" అన్నాడు.

"పాలవాడు వచ్చి వెళ్లిపోయాడు. ఈ సంగతి తెలిస్తే ఎక్కువ పోయించుకునే దాన్ని... ఫరవాలేదు... రేపు మనం మజ్జిగ పోసుకోవడం మానేద్దాం... ఆ పాలు ఆయనకు ఇయ్యొచ్చు..." అంది ప్రత్యూష.

"సరే... నేను మార్కెట్‌కి వెళ్లి వస్తాను..." అంటూ వెళ్లిపోయేడు భవభూతి. తండ్రి చేత మందుబిళ్ల మింగించి, బ్రెడ్డు, పాలు తాగించేడు. ఇల్వాలుడిలో కొడుకులోని పరివర్తన ఆనందం కలిగించింది.

"పడుకోండి నాన్నా?... రాత్రి ఏమైనా అవసరం వస్తే లేపండి. సందేహించవద్దు..." అన్నాడు భవభూతి.

కొడుకు మాటలు ఆయన చెవుల్లో అమృతం చిందించాయి.

"అలాగే..." అన్నాడు. లోపలకు వెళ్లి పడుకున్నాడు.

"ప్రత్యూషా... రాత్రి మధ్యలో మెళకువ స్తే ఒకసారి నాన్నగారిని చూడు. ఆయనకు ఏదైనా అవసరం పడొచ్చు..." అన్నాడు. సరేనంది ప్రత్యూష.

నిజానికి ఆ దంపతులు ఇద్దరూ నిద్రపోతే, తెల్లారేవరకూ లేవరు.

* * *

కిటికీలోంచి వెలుగుపడింది. చీకట్లు అప్పుడే పారిపోతున్నాయి. మెలకువ వచ్చింది ప్రత్యూషకి. టైము చూసింది. అయిదున్నర. లేచి, చీర సవరించుకుని, బాత్‌రూంకి వెళ్తూ బాత్‌రూం గుమ్మం దగ్గర ఆగిపోయింది.

"మైగాడ్..." అనుకుంది. హడావుడిగా వచ్చి భర్తను లేపింది.

"ఏమిటి!" అన్నాడు భవభూతి, బద్ధకంగా.

"మామయ్యగారు బాత్‌రూంలో పడిపోయారు..." అంది ప్రత్యూష. భవభూతి బద్ధకం వెంటనే ఎగిరిపోయింది.

"అలాగా.." అంటూ గబగబా పరుగుతో వెళ్లాడు. ఇల్వాలుడు బాత్‌రూంలో పడిపోయి వున్నాడు. నుదుటి దగ్గరరక్తం గడ్డం కట్టింది. తట్టిలేపాడు భవభూతి... ఎటువంటి రెస్పాన్సూ లేదు.

"సాయం పట్టు..." అంటూ భార్య సహాయంతో తండ్రిని మోసుకుంటూ వచ్చి మంచంపై పడుకోబెట్టాడు నాడి చూశాడు... కొట్టుకోవటం లేదు. అతని మనసు చిన్నగా వణికింది.

"ఉండు... డాక్టర్ని పిలుచుకు వస్తాను..." అంటూ హడావుడిగా చొక్కా తొడుక్కుని తన ఇంటికి పది ఇళ్ల అవతల వుండే ఒక డాక్టరుని పిలుచుకు వచ్చాడు.

ఆ డాక్టర్ వచ్చి పరీక్ష చేసి—

"ప్రాణం పోయింది..." అన్నాడు. తన మీంచి రైలు వెళ్లిపోయినట్లు ఫీలయ్యాడు భవభూతి. తలను చేతుల మధ్య దాచుకుని ఘొల్లున ఏడ్చాడు భవభూతి.

రాత్రి రెండుగంటల ప్రాంతంలో యూరినల్స్‌కి మెళకువ వచ్చింది ఇల్వాలుడికి నీరసంగా లేచాడు కానీ అర్థంపడలేదు. వెళ్లక తప్పదు. అందుకే బలవంతంగా గోడపట్టుకుని నెమ్మదిగా అతి కష్టం మీద బాత్ రూంకి వెళ్లాడు. అక్కడ కాలు జారి క్రిందపడిపోయేడు. లేవడానికి ప్రయత్నిస్తూ మళ్లీ పడటంతో నుదురు గోడకి బలంగా కొట్టుకుంది. ఇక లేవలేక అలాగే కూలబడిపోయి "అబ్బాయీ.. అబ్బాయీ.." అంటూ పిలిచేడు కానీ నీరసం వల్ల ఆ మాటలు పెదవి దాటలేదు. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. మళ్లీ ప్రయత్నించి అతి కష్టం మీద లేచాడు కానీ అడుగుపడలేదు. మళ్లీ పడిపోయాడు. ఆ పడటంలో నేల బలంగా ఛాతీకి తగిలింది. విపరీతంగా నొప్పి కలిగి, ప్రాణం పోయింది. జరిగింది ఇదే.


* * *

తండ్రి మరణానంతరం శాస్త్రోక్తంగా కార్యక్రమం జరిపించేడు భవభూతి. తండ్రి మరణానికి మనసులో కలిగిన బెంగ అతనిలో శాంతిని దూరం చేసింది.

రాత్రి పూట సరిగా నిద్ర పట్టడం లేదు. రోజుకొకసారి అయినా కళ్లనీళ్లు పెట్టుకుంటున్నాడు.

"పితృదేవతా ప్రీత్యర్థం.. పిండప్రదానసమయే..." అంటూ పురోహితుడు తన కంచుకంఠంతో మంత్రాలు చదువుతున్నాడు.

నేలమీద కూర్చుని చేత్తో పిండం కలుపుతున్నాడు భవభూతి. పురోహితుడి మంత్రం అతన్ని కదిలించి వేసింది. చేతులో వున్న పిండం క్రింద వున్న అరిటాకులోకి దొర్లిపడింది. మోకాళ్ల మధ్య తలవంచుకుని ఏడవసాగేడు భవభూతి. పురోహితుడు, ప్రత్యూష అతని వంక ఆశ్చర్యంగా చూసేరు. ప్రత్యూష భర్తని ఓదార్చడానికి రాబోతుంటే వద్దని సైగచేశాడు పురోహితుడు. చేతులో బిస్కట్టు ఎవరో లాక్కుంటే ఏడిచే చిన్నపిల్లవాడి రీతిలో — సర్వసంపదలూ దొంగదోచుకుపోతే గుండెలు బాదుకునే లక్షాధికారి చందాన — బాధపడుతున్నాడు భవభూతి. అతన్ని ఎవ్వరూ ఓదార్చలేరు. ప్రవహించుతున్న నదీ జలానికి ఆనకట్ట వెయ్యడం మంచిది కాదు. నిజమే కదా?



## రూం

ఓ అమ్మాయి, అబ్బాయి హోటల్‌కి వచ్చి రూం కావాలని అడిగారు.

"పెళ్ళి కాకుండా మా హోటల్లో రూం యివ్వం" చెప్పాడు మేనేజర్.

"మా యిద్దరికీ పెళ్ళయ్యిందయ్యా బాబు" అన్నారిద్దరూ.

"రుజువేమిటీ. ఫోటోల్లాంటివి ఏమయినా వున్నాయా!" అడిగాడు మేనేజర్.

"ఆ వున్నాయి. ఇదుగో ఇది నేను మా ఆవిడతో తీయించుకున్న ఫోటో" చూపించాడు అబ్బాయి.

"ఇదుగో ఇది నేను మా ఆయనతో తీయించుకున్న ఫోటో" మరో ఫోటో చూపిస్తు అంది అమ్మాయి.

—జి.యస్. శర్మ
(అమలాపురం)


శ్రీమహాలక్ష్మీ వారి వెరైటీ నవలలు సెప్టెంబర్-20 విడుదల!

పాకెట్ బుక్స్ నెం-1807
మల్లాది వెంకట కృష్ణమూర్తి ............ రూ. 15/-
కరిగిన ముత్యం (డైరెక్ట్ నవల) - "మీరా" లక్ష్మి రూ.20/-
మీరా - లక్ష్మి ............ రూ.30/-
వింత మనుషులు - వసుంధర ............ రూ.18/-
వాడిన మల్లెలు - వేల్పూరి సుభద్రాదేవి ............ రూ.15/-
విషసర్పాలు (అ.ప.స. సీరియల్) - సికిందర్ ............ రూ.18/-
కళాశాల దుర్గం (అ.ప.స. సీరియల్) - బొమ్మిడి అబ్బారావు - రూ.20/-
వారసులు - మాదిరెడ్డి సులోచన ............ రూ.20/-
* నేడే అడ్వాన్సుతో పాటు మీ ఆర్డరును పంపండి!

శ్రీమహాలక్ష్మీ బుక్ ఎంటర్‌ప్రైజెస్
మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ-2 Ph:63322